కథానిక

# ఇంట్లోనే ఉన్న రంభ

అవసరాల రామకృష్ణారావు

"అమ్మమ్మా! నేను మామయ్యనే పెళ్లాడుతాను."

కళ్ళద్దాలు పెట్టుకుని పెరటి వసారాలో పెసల్లో రాళ్ళు ఏరుతున్న అమ్మమ్మ భుజాన్ని తన చిట్టిచేతులతో ఊపుతూ అడిగింది.

"అయ్యో! ఎంతమాట! అలాగే పెళ్ళాడమ్మా! ఇప్పుడే పెళ్ళాడేస్తావా, ఏమయినా వ్యవధి ఉందా?" ఈమాటకి పందిరిమంచంమీద కూర్చునివున్న అమ్మా, అప్పుడే వీధిలోంచి వస్తున్న కామేశంమామయ్యా ఫక్కున నవ్వేరు.

"ఏంరా, నాయనా, మనవరాలు నన్ను ఊఁ సలిపేస్తోంది. త్వరగా ఏదో తేల్చేసుకో. ఏమంటావు వసంతా?"

"నీ కొడుక్కి తగ్గ కట్నం మేమియ్యగలమా అమ్మా?"

"ఏం చమత్కారివే, అయ్యో పాపం నిజమే సుమీ; ఓరోజు తింటే మర్నాడు పస్తే మీరు! మాతో తూగగలరా మరి! ఏం చేస్తాం! పోనీ మరో సమ్మంధం చూసుకోరా కామేశం!"

"నువ్వే అలా అంటే మేం మాత్రం ఊరుకుంటామటే అమ్మా? మాపిల్లే వేసు వెయ్యి వరహాలు. కో అంటే కోటిమంది కాళ్ళదగ్గర కొచ్చి పడతారు. ఏదో మాటవరసకి అన్నానని అదే సాగదీస్తావేమిటి? నువ్వు కామేశం గాడిని పెళ్ళాడకే స్వర్ణా."

"ఊఁ ఊఁ నేను కామేశం మామయ్యనే పెళ్ళాడుతానూ ..." రాగశ్రుతితో పాటు మూతి గూడా బిగించింది తను.

"ఓస్, ఎంతలో ఎంత అలకొచ్చిందో! దీని బుడ్డిమూతి చూడండర్రా ఎంత ముద్దొస్తుందోను" అని, తన్నెత్తుకుని తను అడ్డంగా పెట్టిన రెండుచేతుల్నీ ఒక్కచేత్తో పట్టుకుని ముద్దెట్టుకున్నాడు.

"ఏమిటో చిన్నపిల్లల్ని ఆడించి మనం సరదాపడడమేగాని దాని వయసెంత? వాడి వయసెంత? ఇంకో నాలుగేళ్ళు ముందేనా కన్నావా వసంతా, ఎలాగో అలా సర్దుకుందుమా!"

"పోవే అమ్మా. ఏమిటా హాస్యం? ఇదిగో స్వర్ణా యీ ఆకులు తీసికెళ్ళి వీధిలో మాటాడుతూంటారు మీ నాన్నకిచ్చిరా" అని తనకిచ్చింది అమ్మ. మళ్లీ ఓసారి దసరాకి కాబోలు తనూ, అమ్మా, నాన్నా అమ్మమ్మగారింటికెళ్ళేరు. అమ్మ అమ్మమ్మ నడిగింది.

"ఏమే అమ్మా, కామేశంగాడి కేదేనా సంబంధం కుదిరిందటే?"

"ఏమిటో తల్లీ, వాడికేం నచ్చవు. ఒహటీ యిష్టపడితేనా?"

ఇంతలో కామేశం మామయ్య అక్కడికి వచ్చి తన్ను చూసి—

"ఏమిటో నా వెర్రిగాని యింట్లో యిలాంటి రంభని వదిలేసి పైసంబంధాలు చూసుకోడమేమిటీ నా తెలివితక్కువగాని!" అన్నాడు.

ఆరాత్రి అన్నం పెడుతూ అమ్మ అంది.

"త్వరగా తినెయ్యి తల్లీ! మనం కామేశం మామయ్య పెళ్ళికెళ్ళాలి" ఇలా రెండు నెలల నుంచి చెప్తూ అమ్మ తనకి అన్నం తినిపిస్తోంది, ఎప్పుడూ పెళ్ళి అవకపోడం- చిన్నతనమయినా తనకామాత్రం తెలియకపోలేదు.

"మరి నా పెళ్ళో?" (ఛీ! అప్పుడలా అడగడానికి తనకెంత సిగ్గులేకపోయిందో!)

"నీదీను. తినమ్మా తిను. మనం పెళ్ళికి వెళ్ళాలి మరి. కామేశం మామయ్య పెళ్ళి తప్పకుండా అవుతుంది."

అనుకున్నట్టే అయింది. కామేశం మామయ్య పెళ్ళి విజయతో ఆ సంవత్సరమే అయిపోయింది. విజయేనా నాలుగు రోజుల

పాటు మామయ్యతో కులాసాగా ఉంది గనుకనా? కలరా వచ్చి ఆర్నెల్లక్రితం చచ్చిపోయింది. మామయ్య ఒక్కడూ పాపం ఆ ఏడాది పిల్లాణ్ణి పెట్టుకు ఎలా ఉంటున్నాడో! ఎలా ఉంటే తన కెందుకు?

* * *

డాబామీది యీజీ చైరులో పడుకుని, తలకింద చేతులు పెట్టుకుని కాళ్ళాడిస్తూ, ఆకాశంవైపు చూస్తూ, బాల్యస్మృతులు జ్ఞాపకం తెచ్చుకుంటోంది స్వర్ణ. ఆనాడు మామయ్య అంటే తనకింత అభిమానం ఎందుకుండేదో? నల్లటి రంగూ, టూత్ బ్రెష్‌లా మీసాలూ తన కెందుకు భయమేసేది కాదో! నిర్మలమైన పసిపాప ప్రేమలో రూపానికి చోటు లేదు కాబోలు!

"స్వర్ణా! ఒసే స్వర్ణా!" అమ్మ కేక విని గబగబా మెట్లుదిగుతూ కింది కొచ్చింది స్వర్ణ.

"ఏమే...ఏమిటా ఆలోచనలు? పొద్దుగుంకై పిలుస్తున్నాను. నువ్వు యింట్లో లేవేమోనని భమిడిపాటి వారింటికి కబురంపేను. ఏం చేస్తున్నట్టు?"

"ఏమీ లేదు ఎందుకే అమ్మా?"

"నీకోసం మీ ఫ్రెండ్స్ వచ్చారు. మీ కేదో కన్సెషన్ వచ్చిందిట గా అందరూ మెడ్రాసు సరదాగా వెడతారట. నిన్ను ఎలాగైనా పంపమని ముఖ్యంగా మీ సరళ నన్ను మరీమరీ బలవంతం చేసింది."

"నువ్వేమన్నావే అమ్మా? అలాగే అన్నావా?"

"అనకపోతే బ్రతికనిస్తావుటే అమ్మా? సరేగాని చూడు, నీకు ధర్మాభవారి అబ్బాయి ఎలా ఉన్నాడు?"

స్వర్ణ క్షణంలో ముఖం చిట్లించి మేడమెట్లు ఎక్కిపోతూ సహం దారిలో 'ఛీ' అంది. వసంత ఆశ్చర్యపోయింది.

"వాళ్ళంత ఆశపెట్టుకుంటే, నీది ఒక్క అక్షరమా జవాబు! ఏం తూలిపోతున్నావే మామ్మా! ఇదంతా కుదిర్చే మొగుడు రాకపోడులే!" అనుకుంది.

* * *

రైల్లో అనిపించింది స్వర్ణకు—మామయ్య దగ్గిరకు వెడదామా వద్దా అని. అమ్మ మరీ మరీ చెప్పింది మామయ్య యింట్లోనే దిగమని. ఏం అతనేమయినా శత్రువా ఏమిటి? దిగకపోతే మానె, పోయి చూడ్డానికేం? ఏనా పిల్లాడితో అతనెంత యిబ్బందిపడుతున్నాడో? మధ్యని నే నెందుకు అక్కడ దిగడం? ఓసారి చూసివస్తే సరి" అనిపించింది స్వర్ణకి.

"రైల్లో ఏనా సరదాగా ఉండక ఏమిటా ఆలోచన?" స్నేహితురాలు అడిగింది. "ఈ వయసులో ఉన్న వాళ్ళకి ఏముంటాయి ఆలోచనలు? ఎవడినో ప్రేమించింది కాబోలే!" అని జవాబు చెప్పింది శ్యామ.

"ఛీ! ఊరుకోండి ఏమిటా మాటలు?" అని ప్రిన్సిపాల్ కేకలేస్తే అందరూ గప్‌చిప్‌గా ఊరుకున్నారు.

రైలు సెంట్రల్ స్టేషనులో ఆగింది. స్టేషనులో మామయ్యని చూసి స్వర్ణ ఆశ్చర్యపోయింది.

"ఓ స్వర్ణా! ఏం యిలా వచ్చావు?"

"మా లేడీస్ అందరం మెడ్రాసుకి చిన్న టూర్ వేసుకున్నాం మామయ్యా."

"అయ్యో, నాకు రాయక పోయావా స్వర్ణా! ఏదో "ఏక్సిడెంటల్"గా ఓ ఫ్రెండ్‌ని దిగబెట్టడానికి వచ్చి యిలా కలుసుకున్నాం గాని! సరే యింటికి పద"

"అదేమిటి మామయ్యా, నేను నీతో వచ్చేస్తే మా ప్రిన్సిపాల్ దెబ్బలాడుతుంది."

"అమ్మమ్మా. అలా వల్లకాదు, నే నావిడతో మాట్లాడుతానుగా."

కామేశం కలుపుగోలుతనం చూస్తే స్వర్ణకి ఎంతో ఆశ్చర్యం వేసింది. ఎప్పుడో రెండేళ్ళ కిందట అమ్మమ్మ పోయినప్పుడు యింటికి వచ్చాడుగాని, అప్పుడేనా తనతో ఎప్పుడేనా మాట్లాడితేనా? క్షణంలో ప్రిన్సిపాల్‌ని ఒప్పించి టాక్సీని మాట్లాడి తన పెట్టె బెడ్డింగూ అందులో పెట్టేశాడు కామేశం మామయ్య.

"తంతే, బూర్లగంపలో పడిందట యిలాంటిదే. అదీ చిన్నదీ, వయసులో ఉన్నదీనూ అతనూ ఏమంత పెద్దవాడు కాదు. మళ్లీ వస్తుందంటావా రమా?"

అని సరోజని ప్రశ్నించడం —

"నోరుముయ్" అని ప్రిన్సిపాల్ అనడం స్వర్ణ వినకపోలేదు.

"నేను మళ్ళీ వస్తానంటూవా?" అని మన సును ప్రశ్నించింది.

"అమ్మా నాన్నా కులాసాగా, ఉన్నారా, స్వర్ణా?"

"ఆహాఁ అన్నట్టు కృష్ణుడేడి మామయ్యా?"

ఈ ప్రశ్న మామయ్యను చూడగానే తనకు తట్టనందుకు నిందించుకుంది స్వర్ణ.

"ఇంటి దగ్గిర ఉన్నాడు."

ఏడాది పిల్లాణ్ణి యింటి దగ్గిర ఎలా వదిలి వచ్చాడో ఏమోగాని స్వర్ణకింక ప్రశ్నించ బుద్ధి వెయ్యలేదు! విజయ పోయినప్పుడు అమ్మ మద్రాసువచ్చి కామేశం మామయ్యని "నువ్వెలా పెంచగలవురా, వాడిని! ఆఫీసుకి వెళితే ఇంట్లో పిల్లాణ్ణి ఎవరు చూస్తారు? నా కిచ్చెయ్ పెంచుతాను." అంది. "రోజుకు ఓసారేనా వాడి మొహం చూడక పోతే నే ఉండలేను అక్కయ్యా! ఎలాగో ఓలా తంటాలు పడతాను పిల్లాణ్ణి ఉండనియ్" అని ఎంత బలవంతం చేసినా కృష్ణుడిని ఇచ్చాడు కాదు మామయ్య. ఎలా పెంచుతున్నాడోఏమో! అప్రయత్నంగా మామయ్యవైపు తేరిపారి చూసింది స్వర్ణ. ఇంత సేపట్నుంచీ తను సరిగ్గా పరికించనేలేదు. ఎంత చిక్కిపోయాడు!

"ఏం కామేశం మామయ్యా యిలా ఉన్నావ్?"

"ఎన్నాళ్ళకు పిలిచావ్ స్వర్ణా, కామేశం మామయ్యా అని. మరి నిన్ను నేను 'ఒసే' అన వచ్చునా?"

"ఛీ, ఏం మాట మామయ్యా అది"

టాక్సీ ఊపుతో స్వర్ణ పగటి కలలు విడి పోయాయి.

"ఏమిటి స్వర్ణా? అలా ఉన్నావ్, రాత్రి రైల్లో నిద్ర లేదా ఏమిటి? పద, భోంచేసి పడు కుందువుగాని."

స్వర్ణ తన ఊహలకి తనే సిగ్గుపడుతూ, కంట్లోకి పడుతున్న ముంగురులు వెనక్కి సద్దు కుంటూ మామయ్య గారింట్లో ప్రవేశించింది. వారు వెళ్ళేసరికి కృష్ణుడు ఉయ్యాల్లో పడుకుని నిద్దరోతున్నాడు. ప్రక్కని ఓ మనిషి-నౌఖరు కాబోలు—వాడూ యించుమించు నిద్దరో తున్నాడు. కృష్ణుడిని చూడగానే ఆశ్చర్య పోయింది.

"మాకు పంపించిన ఫొటోలో అంత దుక్కలా ఉన్నాడు. యింతట్లోకే యింత చిక్కిపోయాడేం మామయ్యా? నువ్వూ వాడూ ఒకటే రెండూ నిష్పత్తిలో చిక్కిపోతున్నా రేమిటి?"

ఎందుచేతో హాస్యానికి మామయ్యకి నవ్వు రాలేదు.

"అత్తకోసం బెంగెట్టుకున్నాడా?"

"ఆఁ వాడు మీ అత్తకోసం బెంగెట్టు కున్నాడు, వాడికోసం నేను" అని అటు తిరిగి మామయ్య తువ్వాలుతో కళ్ళు తుడుచుకుని నౌఖర్ని లేపి "ఒరే నటేశం, అమ్మగారు వచ్చారురా. నీళ్లు పెట్టు" అన్నాడు. నటేశం కొళాయి గదివైపు వెళ్లేడు.

"చిక్కిపోయినా వీడి కళా కాంతులు తగ్గ లేదు సుమా మామయ్యా" అని స్వర్ణ మెల్లగా


## హిందీ భవన్
## మద్రాస్-17

దక్షిణ భారత హిందీ ప్రచార సభవారి మధ్యమ, రాష్ట్ర, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలకు పోస్టుద్వారా శిక్షణ నిచ్చును. పాఠ్య పుస్తకములు ఉచితము, పూర్తి వివరములకు వ్రాయుము

నిద్రాభంగం కాకుండా కృష్ణుణ్ణి ముద్దెట్టుకుంది.

* * *

"నన్నెందరో పెళ్లి చేసుకోమన్నారు. కాని ఎలా చెప్పు స్వర్ణా? నా కృష్ణుడే నాకు సర్వస్వం. ఆ వచ్చేది వాడ్ని సరిగ్గా చూడక పోతే నా బ్రతుకేమిటౌతుందో ఆలోచించు. మీ అత్త పోయిన మొదటి రోజుల్లో నేను వీడి గురించి పడిన బాధలు ఒకటీ రెండూ కాదు. ఆఫీసుకి తీసుకు వెడదామంటే బాగుంటుందా చెప్పు? అక్కడికీ ఓనాడు ఆ పనీ చేశాను. అక్కడ నానా హంగామా చేశాడు. ఆఖరికి ఎందర్నో మాట్లాడి చివరికి యీ నటేశంగాడ్ని పెట్టేను. ఆఫీసులో ఉన్నంతసేపూ వీడిమీదే ఉంటాయి ప్రాణాలు." కామేశం యిలా అని, మధ్యలో ఆపి స్వర్ణవైపు చూశాడు. తల క్రిందికి దించుకుని, బొటనవ్రేలుతో గచ్చు నేలపై కనపడని ముగ్గులు పెడుతూ ఏదో ఆలోచిస్తోంది స్వర్ణ. "మామయ్యది ఎంత మంచి హృదయం! అతనికేమంత వయస్సుంటుందని? ముప్పైఐదాటేయో లేదో! తన పిల్లాడి సౌఖ్యం కోసం తన సర్వసుఖాలు త్యాగం చేశాడు!"

ఇద్దరి ఆలోచనలూ కేంద్రీకరింప చేసుకుని కృష్ణుడు ఏడవడం మొదలెట్టేడు. "వాడు ఏడుస్తున్నాడు. వెడతా" అని కిందకు వచ్చేసింది స్వర్ణ. స్వర్ణని చూడగానే కృష్ణుడు ఏడుపు మానేసి రెండూ చేతులూ జాపి ఆమె ఒళ్లో యిమిడి పోయాడు! ఈ నాలుగైదు రోజుల్లోనూ వాళ్ళిద్దరికీ ఎంతో స్నేహం ఏర్పడి పోయింది. స్త్రీస్పర్శకి మొహంవాచిన కృష్ణుడు ఆమెలో తనతల్లిని పోసుకుని, మురుస్తున్నాడు. స్వర్ణకి అనిపించేది· "అయ్యో, వీడికెందుకు యింత చనువు చేస్తున్నాను! నే నిక్కడ శాశ్వతంగా ఉండిపోయేదాన్ని కాదే! ఒక్కసారి ఆనందం మెఱుపులా చూపించి మాయం చేసేస్తే ఆ పసిపాప ఎంతలా బెంగ పెట్టుకుంటాడో! అద్వారా మామయ్య ఎంత దుఃఖిస్తాడో!" పాపాయి ఒంటిమీద చెయ్యి వేసేసరికి వేడిగా ఉంది. "మామయ్యా! యిలా చూడు కృష్ణుడికి జ్వర మొచ్చింది" అని పిలిచింది స్వర్ణ. కామేశం వస్తూనే నిరాశగా కుర్చీలో కూలబడి...

"మళ్ళీ వచ్చిందే, అయితే నా ఉద్యోగం నిలబడినట్టే!"

"అదేమిటి మామయ్యా?"

"ఏమని చెప్పను స్వర్ణా? ఇవాళ నువ్వు వెళ్ళిపోతా నంటున్నావా? మళ్ళీ ఆఫీసుకి సెలవుపెట్టాలి. యింతకు ముందు యిలాగే సెలవుపెడితే ఆఫీసురు ఫైనలు వార్నింగుకూడా యిచ్చేశాడు. జ్వరంలో ఉన్న పిల్లాడిని నౌకరు కప్పజెప్పి ఎలా వెళ్ళను?"

"అయితే నే నివాళకు వెళ్ళనులే."

కామేశం మొహం కాగితం బుట్టలా విడింది.

"నిజంగానా! నిజంగానా స్వర్ణా?"

"అయ్యో-దానికి పెద్ద అంత యిదవుతా వేమిటి? తప్పకుండా ఉంటానుగా! వీలయితే యిక్కడే ఉండిపోతాను కూడాను."

ఆఖరికి మాట అనుకోకుండా అనేసి... స్వర్ణ చాలా సిగ్గుపడిపోయింది. "ఉండి పోయాక?" అని అడిగింది హృదయం. దీనికి సరోజిని జవాబు చెప్పింది. "అదీ, చిన్నదే... వయసులో ఉన్నదీను, అతనూ ఏమంత పెద్ద వాడు కాదు. మళ్ళీ వస్తుందంటావా రమా?" స్వర్ణ బుగ్గలు ఎరుపెక్కాయి. ఎలాగో నిలదీసుకుని ఆ ప్రసంగం మార్చేసి మామయ్య నడిగింది:

"చూశావా, మామయ్యా. మా ప్రిన్సిపల్ గాని ఫ్రెండ్స్‌గాని మళ్లీ వచ్చారు కాదు చూశావా? వాళ్ల సంకుచిత బుద్ధి అంతే."

సరిగ్గా స్వర్ణ అనుభవిస్తున్న బాధనే అనుభవిస్తున్న కామేశానికి యీ అప్రస్తుత ప్రసంగం ఏం నచ్చలేదు.

"మళ్ళీ వాళ్ల అవసరం నీకేం ఉంది స్వర్ణా?" అని దగ్గిరకు వచ్చి "ఏమిటో నా వెర్రిగాని యింట్లో రంభలాంటి పిల్లని వదిలేసి పై సంబంధాలు చూసుకోవడమేమిటో. నా తెలివి తక్కువగాని!" అని ఆమెను చేతుల్లోకి తీసుకున్నాడు. వాళ్ళిద్దర్నీ కలిపిన పాపాయి కిలకిలా నవ్వుతున్నాడు.